## మోదీ రోడ్‌షోను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న రాంచందర్‌రావు

మల్కాజిగిరి: ఈ నెల 15వ తేదీన మల్కాజిగిరిలో నిర్వహించే ప్రధాని మోదీ రోడ్‌షోను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్ కోరారు. పద్మావతి ఫంక్షన్ హాల్ సన్నాహక సమావేశం బుధవారం ఏర్పాటు చేశారు. మూడు పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని రోడ్‌షో సాయంత్రం 4 గంటలకు మీర్జాలగూడ నుంచి మల్కాజిగిరి చౌరస్తా వరకు కొనసాగుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందు జరుగుతున్న రోడ్‌షోతో పార్టీకి బలం చేకూరుతుందని, విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రవణ్, సునీతాయాదవ్‌తో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, పట్టుదలతో ఏదైనా సాధ్యం


మహాభోది విద్యాలయలో వీడ్కోలు వేడుకల్లో విద్యార్థులు

అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలోని మహాభోది విద్యాలయంలోని 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ వెన్నెల గద్దర్ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల ఉంటే నిర్దేశించుకున్న లక్ష్యాలను సునాయాసంగా చేరుకోవచ్చన్నారు. అదేవిధంగా తోటివారితో స్నేహభావంతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భవాని, పరిపాలనాధికారి రాము, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ సునీతయాదవ్

మౌలాలి: డివిజన్ పరిధిలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీత శేఖర్‌యాదవ్ హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రాధాబాయ్, అరుణ, సుజాత, ఉమ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

## మూడోసారి మోదీ ప్రధాని ఖాయం


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మౌలాలి: ప్రధాని నరేంద్రమోదీ మూడవసారి ప్రధాని కావడం ఖాయమని మాజీ మంత్రి, మల్కాజ్‌గిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కాలనీ సంఘాల ఆత్మీయ సమ్మేళానికి ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. దేశం సుభిక్షంగా ఉండాలంటే మరోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణయాదవ్, వి.కే మహేష్, బాలచందర్, సాయిబాబా, శివ, శ్రీనివాస్ యాదవ్, ప్రసన్న, రాధాభాయ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపులను కార్పొరేషన్‌లో చేర్చడంపై హర్షం


సిరిగిరి రాజు

గౌతంనగర్: మున్నూరు కాపు సంఘాన్ని కార్పొరేషన్‌లో చేర్చడం పట్ల మున్నూరు కాపు మహాసభ కార్యవర్గ సభ్యులు సిరిగిరి రాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాల మున్నూరు కాపుల కల నేడు సాకారమైందన్నారు. మున్నూరు కాపు సంఘాన్ని కార్పొరేషన్‌లో చేర్చినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్యవైశ్య కార్పొరేషన్ ప్రకటించడం పట్ల హర్షం


సాంబశివరావు

మల్లాపూర్: 40 ఏళ్ల తర్వాత ఆర్యవైశ్యులకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించడం, ఆర్యవైశ్య కార్పొరేషన్ ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బుధవారం రాష్ట్ర ఆర్యవైశ్య నాయకులు పరిటాల సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలోని నిరుపేద ఆర్యవైశ్యులకు న్యాయం జరుగుతుందని అన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఆర్యవైశ్యుల పక్షాన నిరంతరం గొంతు వినిపించామన్నారు.

## 24 సీసీ కెమెరాలు ప్రారంభం

కీసర: ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం నాగారం మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు విష్ణుపురి కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసులందరూ ముందుకొచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు.

# పది పరీక్షలకు సర్వం సిద్ధం

- ఈనెల 18 నుంచి పరీక్షలు ప్రారంభం
- ఉప్పల్ మండల పరిధిలో 37 పరీక్షా కేంద్రాలు.
- హాజరుకానున్న విద్యార్థులు 5,090 మంది



రామంతాపూర్: ఉప్పల్ మండల పరిధిలో ఈ నెల 18 నుంచి 30 వరకు నిర్వహించే పదో తరగతి పరీక్షలకు పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి సర్వం సిద్ధం చేసినట్లు ఉప్పల్ మండల విద్యాధికారి శశిధర్ తెలిపారు. సాక్షితో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్, నాగోల్, కొత్తపేట తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 37 పరీక్షా కేంద్రాల్లో 5,090 విద్యార్థులు హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ప్రణాళికబద్ధంగా ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, ఉత్తీర్ణత శాతం పెంచడానికి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కూడా నిర్వహించామన్నారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు తమ హాల్ టికెట్ ఎక్కడైనా పడిపోయి దొరకకుండా ఉంటే వెబ్‌సైట్ ద్వారా ఇంటర్నెట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. పరీక్ష అధికారి వద్ద ఫొటో గుర్తింపుతో పోల్చి చూసుకుని సరిగ్గా ఉంటే అధికారులు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఉదయం 9.30 గంటలలోపే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తారని, ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అనుమతించాలని ఆయన పేర్కొన్నారు. మాల్ ప్రాక్టీస్‌లో దొరికితే ఆ విద్యార్థులను తర్వాత పరీక్షకు అనుమతి ఉండదని ఆయన తెలిపారు.

## ఉప్పల్ స్కూల్ అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు


పత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ రజిత, పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ జిల్లా పరిషత్ పాఠశాలను రూ.2 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌కు రూ.2 కోట్ల నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలలు సరైన వసతులు లేక కొట్టు మిట్టాడుతున్నాయని, ఇప్పుడు వాటికి మహర్దశ వచ్చిందన్నారు. త్వరలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటు ఇతర ప్రభుత్వ పాఠశాలలను కూడా అభివృద్ధి చేయనున్నట్లు పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. అడగ్గానే నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ నాగేందర్, ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, ఎల్జిబెత్, కాంగ్రెస్ నేతలు రఘుపతిరెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, సల్ల ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్, ఆగంరెడ్డి, శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'జీ' ఆధ్వర్యంలో మైండ్‌వార్స్ షురూ..

సాక్షి, సిటీబ్యూరో: జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం మైండ్ వార్స్ పేరిట విభిన్న రకాల క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఉమేష్ కెఆర్ బన్సాల్ ఓ ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా సైన్స్, మ్యాథమెటిక్స్, జనరల్ నాలెడ్జ్, సైబర్ టెక్నాలజీలలో మైండ్ వార్స్ ఒలింపియాడ్, భాషా నైపుణ్యాలకు సంబంధించి మైండ్ వార్స్ స్పెల్ బీ ఇండియా, జియోగ్రఫీ, క్రీడలు, చరిత్ర తదితర అంశాలకు సంబంధించి మైండ్ వార్స్ నాలెడ్జ్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు.

## కాంగ్రెస్ మల్లాపూర్ అధ్యక్షుడిగా సాయికిరణ్‌గౌడ్



మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కప్పర సాయి కిరణ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి నియామకపు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లాపూర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

కలెక్టర్ గౌతమ్

సాక్షి,మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవటంతోపాటు ముందస్తు కార్యాచరణ కార్యక్రమాన్ని రూపొందించుకోవాలని నోడల్ అధికారులను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్నికల నోడల్ అధికారులతో లోక్‌సభ ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లపై ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో అన్ని విభాగాల నోడల్ ఆఫీసర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తూ.. ఎలాంటి లోపాలు తలెత్తకుండా విధులను నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది డేటా నమోదు పూర్తి చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించి అన్ని విభాగాల సిబ్బందికి శిక్షణ పూర్తి చేయాలన్నారు. ఎన్నికల సామాగ్రి సేకరణ పూర్తి చేయాలని సూచించారు. పోలీసు బందోబస్తు పకడ్బందీగా చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంతో పాటు ఆవరణలో సీసీ కెమెరాల ఏర్పాటుపై కార్యాచరణ కార్యక్రమాన్ని ఖరారు చేయాలన్నారు. వాహనాలకు జీపీఎస్ సిస్టం అమర్చి, వాటిని ట్రాక్ చేయాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, నోడల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అక్రమ ఇళ్లు, లేఅవుట్ల కూల్చివేత



కీసర: చీర్యాల గ్రామపంచాయతీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఇళ్లను బుధవారం రెవెన్యూ, పంచాయతీ అధికారులు పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. చీర్యాల గ్రామంలో మాజీ సర్పంచులు, గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన గ్రామకార్యదర్శుల ఫోర్జరీ సంతకాలతో అనుమతులు తీసుకొని ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని చీర్యాలపెద్ద చెరువు బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోకుడా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు జిల్లా పంచాయతీ అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజాము 6 గంటల నుంచే రెవెన్యూ, పంచాయతీ అధికారులు సంయుక్తంగా జేసీబీల సహాయంతో కూల్చివేతలు చేపట్టారు. డీఎల్‌పీఓ సాంబిరెడ్డి, తహసీల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీఓ గ్రామ, మండల పంచాయతీ అధికారి వినూత్నరెడ్డి ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. పెద్ద చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన 11 ఇళ్లతోపాటు మరో 40 ఇళ్లను, కీసర ఓఆర్‌ఆర్ సమీపంలో సర్వే నెంబర్ 100, 101లో వెలసిన అక్రమ లేఔటు చుట్టూ ప్రహరి, ప్లాట్ల హద్దురాళ్లు తొలగించారు. అక్రమ నిర్మాణాలు, అక్రమంగా ఫోర్జరీ సంతకాలు, స్టాంపులతో మోసం చేస్తున్న వ్యక్తులపై విచారణ చేపట్టి సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని తహసీల్దార్ అశోక్‌కుమార్ హెచ్చరించారు.


చీర్యాలలో..

## మొల్లమాంబ జయంతి వేడుకలు



గౌతంనగర్: వివేకానంద రైసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకలు గౌతంనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు కుమ్మరి రాజు హాజరై మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామాయణాన్ని సంస్కృతంలో నుంచి తెలుగులోకి అందరికీ అర్థమయ్యే రీతిలో ఐదు రోజుల్లోనే రచించిన గొప్ప కవయిత్రి మొల్లమాంబ అన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు వెంకటరమణ, బాలనర్సింహ, లచ్చయ్య, దశరథ్, చిన్న, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ ఆర్‌కేనగర్‌లో రూ.28 లక్షలతో చేపట్టిన పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ బుధవారం పరిశీలించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో పనులు ప్రారంభించడంలో జాప్యం జరిగిందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పనులు చేసేందుకు అంగీకరించారని త్వరితగతిన పూర్తి చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో గణేష్, విజయ్‌కుమార్, రంగారావు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పీఎం సూరజ్ పోర్టల్'లో కలెక్టర్



సాక్షి, మేడ్చల్ జిల్లా: సామాజిక అభ్యున్నతి అండ్ ఆధారిత ప్రజా సంక్షేమం పీఎం సూరజ్ పోర్టల్‌ను బుధవారం ఆన్‌లైన్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పాల్గొన్నారు. పీఎం సూరజ్ పోర్టల్ ద్వారా ప్రధానమంత్రి రూ. లక్ష ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు రుణ వితరణ కింద అందజేయటం జరిగింది. సఫాయి కార్మికులకు అయుష్మాన్ హెల్త్ కార్డులు మంజూరు చేశారు. ఈ కార్డుల ద్వారా రూ.ఐదు లక్షల వరకు ఆరోగ్య బీమా అందరి కార్మికులకు వర్తింపజేస్తున్నట్లు ప్రకటించారు.

## నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమి కబ్జా

- ఇద్దరి అరెస్టు పరారీలో నలుగురు
- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంక్షేమ సంఘం వినతి


కామాక్షిపురంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి

రామంతాపూర్: పరిధిలో కామాక్షిపురంలో తప్పుడు నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక సంక్షేమ సంఘం అధ్యక్షులు దుర్గేష్, ప్రధాన కార్యదర్శి వలిగొండ నారాయణదాసు, కోశాధికారి తుమ్మల రవి కురుమూర్తి కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కామాక్షిపురం వీధి నంబర్- 8 ప్లాట్ నంబర్-189లో గల కోట్లు విలువ చేసే 200 గజాల ప్రభుత్వ స్థలాన్ని తప్పుడు నకిలీ పత్రాలు సృష్టించి గోపాల్ యాదవ్ వీరయ్య, రమేష్, వెంకటేశం, నాగరాజు, మంజుల అనే వ్యక్తులు కబ్జా చేసినట్లు వారు వెల్లించారు. ఈ విషయాన్ని ఉప్పల్ పోలీసులకు సంక్షేమ సంఘం నేతలు ఫిర్యాదులు చేయడంతో కేసులు నమోదు చేసి వీరయ్య, రమేష్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మరో నలుగురు పరారీలో ఉన్నట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయంలో ఉప్పల్ పోలీసులు పరారీలో ఉన్న నిందితులను సైతం అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా స్థానికంగా ఉన్న ప్రభుత్వ భూములు కాపాడేందుకు తాము చేస్తున్న పోరాటానికి ఎమ్మెల్యే, కార్పొరేటర్లు సహకరించాలని వారు కోరారు.

## ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- రూ.26 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


చిలుకానగర్‌లో సీవరేజ్ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ గీత తదితరులు

ఉప్పల్: ఉప్పల్ చిలుకానగర్ డివిజన్‌లో రూ.26 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీవరేజి పైప్‌లైన్ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ధర్మపురి కాలనీలోని సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రధాన సమస్యలు తెలుసుకున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జలమండలి జీఎం సంతోష్, డీజీఎం రజినీకాంత్‌రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్, పల్లె నర్సింగ్‌రావు, ఎస్.భాస్కర్, పిట్టల నరేష్, కొండల్‌రెడ్డి, పల్లె రాజ్‌కుమార్, బింగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో సినీ గాయని సునీత సందడి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సినీ గాయని సునీత, కౌశిక్‌రామ్, వరప్రసాద్

ఉప్పల్: సినీ గాయని సునీత బుధవారం ఉప్పల్‌లో సందడి చేశారు. తన పాటలతో అలరించారు. అందరినీ ఆప్యాయంగా పలకరించారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం మాదాపూర్ శిల్పకళా వేదికలో టెంపుల్ బెల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించే సంగీత కార్యక్రమం పోస్టర్‌ను నిర్వాహకులు కౌశిక్ రామ్ ముద్దాలి, ఎస్‌వీఎం గ్రాండ్ హోటల్ యజమాని వరప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలాకాలం తర్వాత నగరవాసులకు మంచి సంగీత ప్రదర్శన అందించనున్నట్లు తెలిపారు. ప్రఖ్యాత సింగర్స్, మ్యూజిషియన్స్, సంగీత కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్పంచుకుంటారని తెలిపారు. నిత్యం ఉద్యోగ వ్యాపార జీవితాలతో బిజీగా గడిపే నగరవాసులకు ఇలాంటి కార్యక్రమాలు ఊరటనిస్తాయని, మంచి ఆలోచనలను కలిగిస్తాయని తెలిపారు. సంగీత కార్యక్రమం అందరినీ అలరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారోత్సవంలో మేయర్, డిప్యూటీ మేయర్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వీరాంజనేయ స్వామి దేవాలయం నూతన ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్ పాల్గొని ఆలయ నూతన కమిటీ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ చైర్మన్‌గా పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్‌గా నారోజు జంగాచారి, లోడె పవన్‌కుమార్ గౌడ్, బార్ల నాగరాజు, ఎర్ర ఐలేష్‌యాదవ్, కొల్తూరి కుమార్, ముదిగొండ మహేశ్వరి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పారదర్శకంగా పనిచేసి, ప్రతి రూపాయి జమ, ఖర్చులను ప్రతినెలా కమిటీ సభ్యులకు, భక్తులకు తెలియజేస్తామని పేర్కొన్నారు. ఆలయ పరిరక్షణ కోసం అంకితం అవుతామని వారు ప్రమాణం చేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు ఆలయ బాధ్యతలను అప్పగించారు. కార్యక్రమంలో నాయకులు పాశం బుచ్చి యాదవ్, తుంగతుర్తి రవి, వంగేటి ప్రభాకర్ భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఘట్‌కేసర్: అంకుషాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995–1996 విద్యాసంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక శ్రీనిధి రిసార్ట్స్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యా, ఉద్యోగం కారణంగా ఇంతకాలం దూరమైన బాల్యస్నేహితులను ఒక్కసారిగా చూసి పులకరించిపోయారు. స్నేహితులు, కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో వారు చేసినచిలిపి పనులను జ్ఞాపకం చేసుకుని మురిసిపోయారు. తమ జీవితాలకు బంగారు బాట వేసిన ఉపాధ్యాయులు సుమీల, భాగ్యవతి, సాయిరెడ్డి, వెంకట్ స్వామి, భాస్కర్, సత్యనారాయణలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. విద్యార్థులు తులసి, అనిత, సునీత, స్వప్న, కవిత, గీత, సరస్వతి, మంగ, మహేశ్వరి, లాలయ్య, బాలస్వామి, అరవింద్, జాషువా, స్వామి సాబేర్, రమేష్, సత్తయ్య పాల్గొన్నారు.